క్లుప్తంగా

రామన్నపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



రామన్నపాలెంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ శాఖ అధికారులు

అచ్యుతాపురం: మండలంలోని రామన్నపాలెంలో విద్యుత్ శాఖ అధికారులు శనివారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య అధికంగా ఉందని స్థానికుల నుంచి ఫిర్యాదులు, వినతులు అందిన నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో స్థిరమైన ఓల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని దళితుల వినతి



గణపర్తి సర్పంచ్ నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న దళితులు

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మండలంలోని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడుకు దళితులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో నాయుడు మాట్లాడుతూ గణపర్తి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణతో పాటు రహదారులు, కాలువల వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్టా అప్పారావు, అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు గొంది రవికుమార్, వార్డు సభ్యులు యల్లబిల్లి దేముడు, భీంపల్లి శంకర్, స్వామి సత్యనారాయణ, నేలపాటి శంకర్, వెంకట రమణ, గణేష్, అశోక్, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఆక్సాహేబుపేటలో పశు వైద్య శిబిరం



ఆక్సాహేబుపేటలో పశువులకు చికిత్స అందిస్తున్న పశు వైద్యులు

కోటవురట్ల: ఆక్సాహేబుపేట గ్రామంలో ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పాములవాక పశువైద్య శాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రైతులు పెద్ద సంఖ్యలో పాడి పశువులకు చికిత్స చేయించారు. పశు వైద్యాధికారి డాక్టరు హరిప్రియ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని తెలిపారు. ఈ శిబిరంలో 27 ఎదకు రాని పశువులకు, 23 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు పెట్ల నరేష్, సురేష్, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొన్ని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం టౌన్ ఫీడర్‌లో ఎస్.రాయవరం, సర్వసిద్ధి, వాతాడ ఆక్వా సర్వీసెస్‌కి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఎస్.రాయవరం రూరల్ ఫీడర్‌లో ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, కర్రివానిపాలెం, బసవపాడు గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళాలు



విరాళం అందిస్తున్న ప్రకాశరావు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. మునగపాకకు చెందిన పెంటకోట శివ సూర్య ప్రకాశరావు, లలిత తులసీ దంపతులు రూ.26వేల నగదును శనివారం విరాళంగా అందజేశారు. మునగపాకకు చెందిన బొడ్డేడ దుర్గునాయుడు తనవంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కమిటీ సభ్యులు పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు, కేవీఎస్ అప్పారావు, జల్లేపల్లి కిష్టప్ప ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాగని చేపల వేట.!

- సముద్రంలో తగ్గిన మత్స్య సంపద
- ఫార్మా వ్యర్థాలే కారణమంటూ మత్స్యకారుల గగ్గోలు
- తీరానికే అధిక శాతం బోట్లు పరిమితం



చేపలు వేట అంతంతమాత్రంగా ఉండడంతో తీరానికే పరిమితమైన బోట్లు



ఆరుగురు మత్స్యకారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేటాడిన చేపలు

పాయకరావుపేట: సంద్రంలో మత్స్య సంపద తగ్గిపోతోంది. అనుకున్నంత స్థాయిలో చేపల వేట సాగక మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మత్స్య సంపద తగ్గిపోవడానికి ఫార్మా వ్యర్థాలే కారణమంటూ మత్స్యకారులు గగ్గోలు పెడుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 20 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 40 వేల మంది మత్స్యకార జనాభా ఉంది. 20 గ్రామాల్లోను 10 వేల మంది వరకు సముద్రంపై చేపల వేటకు వెళ్లి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. గతంలో మత్స్యకారులకు ఆశించిన స్థాయిలో చేపలు వేట సాగేది. ప్రస్తుతం చేపల వేటకు వెళ్తున్నప్పటికీ అంతంత మాత్రంగానే చేపలు పడుతుండడంతో మత్స్యకారులు నిరాశతో ఒడ్డుకు చేరుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాణాలకు తెగించి చేపల వేటకు తెల్లవారుజామున 4 గంటలకు వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఒడ్డుకు చేరుతున్నా కూలీ డబ్బులు కూడా రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలా వరకు బోట్లు తీరానికే పరిమితమయ్యాయి.

ఫార్మా వ్యర్థాలతో ముప్పు

స్థానిక రసాయన పరిశ్రమల వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు ఉత్పత్తి తగ్గిపోతోంది. గతంలో తీర పరిసరాల్లోనే చేపలు సమృద్ధిగా లభించేవి. ఇప్పుడు తీరానికి దూరంగా వెళ్లి వేట సాగించినా ఫలితం ఉండడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా మత్స్యకారులకు భరోసా కల్పించడంలో విఫలమైందని ఆరోపణలు ఉన్నాయి. బీమా సౌకర్యం సక్రమంగా కల్పించడం లేదు. రాయితీపై సరఫరా చేసే డీజిల్‌పై పెట్రోల్ బంక్ యాజమాన్యం సుముఖత వ్యక్తం చేయడం లేదని చెబుతున్నారు.

కానరాని జెట్టీ సదుపాయం

సముద్రంపై వేటకు వెళ్లి తిరిగి ఒడ్డుకు వచ్చేటప్పుడు జెట్టీలు అవసరం. వేటకు వెళ్లే మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం. ఇక్కడ జెట్టీ ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈలోగా కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రతిపాదనలు సముద్రం నీటిలో కలిసిపోయాయి. మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై ఇంజన్లు, బోట్లను మంజూరు చేయడం లేదు.



వెంకటనగరం వద్ద జెట్టీ నిర్మించాల్సిన ప్రదేశం

చేపలు ఎండబెట్టడానికి సముద్రం ఒడ్డున ప్లాట్ ఫారాలు కూడా లేవు. స్థానికంగా ఏర్పాటు చేసే కంపెనీల్లో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీలు కూడా నెరవేరకపోవడం, చేపలు వేట సాగకపోవడంతో మత్స్యకారులను ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫ్యాక్టరీల కాలుష్యంతోనే సమస్య



ఫ్యాక్టరీల కాలుష్యం కారణంగా చేపలు స్థానికంగా లభ్యం కావడం లేదు. మత్స్యకారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపలు వేట సాగించినా సరే కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం బీమా సౌకర్యం, డీజిల్ రాయితీ, ప్లాట్‌ఫారాలు, జెట్టీ నిర్మాణం, రాయితీపై ఇంజిన్‌లు, బోట్లు అందించాలి. వైఎస్సార్ సీపీ పాలనలో మత్స్యకారులకు ఎంతో బాగుండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోవడం లేదు.

– చోడిపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర మత్స్యకార సొసైటీ మాజీ డైరెక్టర్, వెంకటనగరం

కన్నబాబుకు అభినందనలు



కన్నబాబురాజుకు అభినందనలు తెలుపుతున్న రాంబిల్లి జెడ్పీటీసీ నాగరాజు, తదితరులు

రాంబిల్లి(అచ్యుతాపురం): వైఎస్సార్‌సీపీ కేంద్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ నియోజకవర్గ వాలంటీర్ వింగ్ అధ్యక్షుడు సారిపల్లి పైడిరాజు, మండల కార్యదర్శి వియ్యపు చిరంజీవి, తదితరులు కన్నబాబుకు అభినందనలు తెలిపారు. కన్నబాబు రాజుకు ప్రాధాన్యతతో కూడిన పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

శ్మశానవాటికలో మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న దృశ్యం

అచ్యుతాపురం: మల్లవరం పంచాయతీ శ్మశానవాటికలో సర్పంచ్ పిన్నమరాజు వాసు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిశోర్, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, మాజీ సర్పంచ్ కందిపల్లి శ్రీనివాసరావు, చందక శివ, పిన్నమరాజు శైలేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే పరిశుభ్రత సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం: గ్రామాల్లో పరిశుభ్రత కోసం పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో మీనాకుమారి కోరారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు పంచాయతీ కార్యదర్శి ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు పర్యవేక్షణలో ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నదీ, లేనిదీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పర్యవేక్షించాలన్నారు. పంచాయతీలో నిధులకు మించి ఖర్చులు ఉండకూడదన్నారు. పంచాయతీ నిధులు ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటికి కేటాయింపులు జరగాలన్నారు. ఆ తరువాతే మిగిలిన పనులకు వెచ్చించాలని సూచించారు. అడ్డురోడ్డు, చినగుమ్ములూరు మీదుగా దార్లపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు రెండేళ్లుగా నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రమాదకరంగా మారిందని, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండిపడ్డారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని, వినియోగంలోకి తీసుకురావాలని వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీఈవో సత్యనారాయణ, ఎంఈవో శ్రీరామమూర్తి, సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, దూళి శ్రీనుబాబు, గాడి అప్పలనరసింహ, భూపతి అప్పారావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బాలం వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా బయో వ్యర్థాల నిర్వహణ : డీసీహెచ్‌ఎస్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..



యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో బయో వ్యర్థాలు వేసేందుకు ఏర్పాటు చేసిన బిన్‌లు

యలమంచిలి రూరల్: వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో బయో వ్యర్థాల నిర్వహణపై వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపడంపై జిల్లా వైద్య సేవల సమన్వయకర్త శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన 'బయో వ్యర్థాలు'కథనానికి ఆయన స్పందించారు. ఈ ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ ఉంచేందుకు నాలుగు రంగుల బిన్లకు బదులుగా ఒక్క పసుపు రంగు డబ్బా మాత్రమే ఉపయోగిస్తున్నారు. దీనిపై సాక్షిలో కథనం రావడంతో డీసీహెచ్‌ఎస్ శనివారం ఉదయమే ఇక్కడ ఆస్పత్రి సూపరింటిండెంట్‌కు ఫోన్ చేసి బయో వ్యర్థాల నిర్వహణకు ఉంచాల్సిన నాలుగు రంగుల బిన్లను సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. ఈ మేరకు వెంటనే యలమంచిలి ఆస్పత్రిలో నాలుగు రంగుల డబ్బాలను ఏర్పాటు చేశారు. తమ పరిధిలో ఆస్పత్రుల్లో బయో వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండేలా పర్యవేక్షిస్తామని డీసీహెచ్‌ఎస్ తెలిపారు. రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా బయో వ్యర్థాల నిల్వ చేయడానికి అవసరమైన నాలుగు డబ్బాలను బయటకు తీశారు. ఇక ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు మాత్రం ఇంకా నిర్లక్ష్యం వీడలేదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఉదాసీనత కారణంగా కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో వీటి నిర్వహణ సక్రమంగా జరగడంలేదు.

నూతన జీఎస్టీతో ప్రజలకు మేలు



మాట్లాడుతున్న ప్రతిభాదేవి

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన నూతన జీఎస్టీ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని జీఎస్టీ డిప్యూటీ అడిషనల్ కమిషనర్ ప్రతిభాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం వివిధ రకాల వ్యాపారస్తులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా నగదు ఆదా అవుతుందన్నారు. పలు రకాల సేవలపై ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ విధానం ద్వారా మేలు జరుగుతుందన్నారు. మండల పరిషత్ సూపరింటిండెంట్ ప్రసాద్, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కును తక్షణం రద్దు చేయాలి



బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: నక్కపల్లి మండలంలో తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కును తక్షణమే రద్దు చేయాలని, మత్స్యకారులను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఎప్పుడు నిలబడలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తీవ్రమైన కాలుష్యం వెదజల్లి మత్స్య సంపద, పచ్చని పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఇప్పటికే ఫార్మా వ్యర్థాలతో సముద్రంలో చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పరమేశ్వరి, దేవుడుబాబు, బాబ్జీ, సత్తిబాబు, వెంకటేశ్వరరావు, భద్రం, విత్తనాల పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు కశింకోట విద్యార్థి



విద్యార్థి కేశవ్

కశింకోట: కశింకోటలోని డీపీఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. గోపాలపట్నంలో శనివారం నిర్వహించిన ఉభయ విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలో డీపీఎస్ హైస్కూలు విద్యార్థి బి.కేశవ అండర్-17 విభాగంలో సత్తా చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్.జె.వి.ప్రసాద్, పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల తెలిపారు. కేశవకు విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జనోత్సవాలు



తిమ్మాపురంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని తలపై ఉంచి ఊరేగిస్తున్న బొడ్డేడ ప్రసాద్, భక్తులు



పాములవాకలో కనకదుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు



యలమంచిలి గాంధీనగర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మునగపాక: మండల వ్యాప్తంగా కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జనంలో భాగంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శిరస్సుపై ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్నసమారాధన

ఎస్.రాయవరం: తిమ్మాపురంలో దుర్గమ్మ మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.ఎ.ఎస్.మధువర్మ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, పార్టీ నాయకులు అద్దేపల్లి బొజ్జన్న, చేకూరి శ్రీరామచంద్రరాజు, వియ్యపు సింహాద్రి, పాలుమూరి అప్పలరాజు, చోడిపల్లి గోవిందు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాక గ్రామం దుర్గమ్మ శరణు ఘోషతో హోరెత్తింది. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో అమ్మవారి నిమజ్జనోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఊరేగించగా గ్రామం అంతా కదిలివచ్చింది. ప్రతి కుటుంబం నుంచి అమ్మవారికి సారెను తీసుకుని రాగా అమ్మవారినిసాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా సాగనంపారు. గ్రామం శివారున ఉన్న ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో భవానీ భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

1000 మందికి అన్నసంతర్పణ

యలమంచిలి రూరల్: పట్టణంలోని గాంధీనగర్ దుర్గమ్మ విగ్రహం వద్ద భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కమిటీ సభ్యులు శనివారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. కోలాట ప్రదర్శనతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణానికి సమీపంలో నారాయణపురం మైనర్ శారదానదిలో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం సుమారుగా వెయ్యి మందికి పైగా భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి చీరలకు వేలం పాట నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పిల్లా శ్రీనివాసరావు, కరణం శ్రీనివాసరావు, బోదెపు ఉమేష్, కొనసం సత్యనారాయణ, పప్పు గణేష్, ఉడా కృష్ణ, బొడ్డేటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ వేడుక



గ్యార్వీ వేడుకలో పాల్గొన్న ముస్లిం యువకులు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో గ్యార్వీ వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. ఉస్మాన్ ఘని, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు. గౌస్ పాక్ నిషాని నుంచి గ్రామ వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. విశాఖకు చెందిన డీజే విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

7న నల్లకొండమ్మ తల్లి పండగ



నాతవరం: స్థానిక నల్లకొండమ్మ తల్లి పండగను ఈ నెల 7న ఘనంగా నిర్వహించడానికి గ్రామ పెద్దలు నిర్ణయించా రు. శనివారం వారంతా ఇక్కడ ఆలయంలో సమావేశమై వివరాలు వెల్లడించారు. పండగ సంద ర్భంగా గుర్రపు పందాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన గుర్రాలకు ప్రోత్సాహక బహుమతులతోపాటు షీల్డు అందజేస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, నాలుగు నుంచి ఏడో స్థానం వరకు నిలిచిన గుర్రాలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2500 అందజేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

21వ రోజుకు మత్స్యకారుల నిరాహార దీక్ష



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారానికి 21వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు వైఎస్సార్ సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ రెండో దశ విస్తరణకు అదనంగా భూములు సేకరించాల్సిన అవసరం లేదన్నారు. అర్సిలర్ మిట్టల్ కంపెనీకి అవసరమైన 2 వేల ఎకరాలు కేటాయించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలకు, మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే కంపెనీలను ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రకటన చేయాలన్నారు. హోంమంత్రి అనిత ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, సోమేష్, నగేషు, తదితరులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు అనుకూలంగా ప్రకటన చేయకపోతే పనులు అడ్డుకుంటామన్నారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ధ్రువీకరణ పత్రాల అందజేత



అంగన్‌వాడీ పిల్లల తల్లులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటూ ఐదేళ్లు పూర్తయిన పిల్లల తల్లులకు ఆయన శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు పొందిన పిల్లలు స్థానికంగా ఉన్న పాఠశాలలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎంఈవో వేణుగోపాలరావు, పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉపాధ్యాయులు శనివారం పాయకరావుపేటలో ర్యాలీ చేపట్టారు. నాలుగు డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, 12వ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఎఫ్ఏపీటీవో, ఎస్సీ, ఎస్టీ యూనియన్ నాయకులు కె.కె.ధర్మారావు, పి.వెంకటరావు, వై.ఆనందరావు, కె.ఎస్.ఎస్.సాయిప్రసాద్, పి.వి.గణేష్, జె.వి.ఎన్.పి.రాజేష్, డి.కొండలరావు, వై.కృష్ణ, తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.